

# ఇల్లూ - ఇల్లాలూ

పి. సరళాదేవి

జట్కా దిగింది శకుంతల. ఆ ఇల్లు చూచేసరికి గుండె గుభేల్‌మంది. పెద్ద మేడ. మేడ మీద కూడా గదులు వున్నట్టున్నాయి. ఇంతపెద్దిల్లు ఎంతద్దె ఉంటుందో ఏమో?—అనుకుంటూనే రాజారావు తలుపు తెరుస్తూంటేలోపలకడుగుపెట్టింది.

ముందు నడవా, ఎడమచేతిప్రక్క ఒక గది, కుడిచేతిప్రక్క మేడమీదకు మెట్లు, తరువాత పెద్ద హాలు, మళ్లా నడవా, ఎడమచేతి ప్రక్క వంటిల్లు, కుడిచేతిప్రక్క స్టోర్ రూము, అవి దాటితే పెరడు.

కిందంతా చూసేసి మేడమీదకు వెళ్లింది. క్రింద హాలుకుపైన ఒక హాలు, నడవ గదికిపైన ఒక పెద్దగది, తరువాత వంటిల్లు, స్టోర్ రూము, నడవకు పైన డాబా ఉన్నాయి. మాట్లాడకుండా అంతా చూసింది.

ఇద్దరికి ఇంతపెద్దిల్లు ఎందుకు? ఈ ఇల్లంతటికీ ఆయన లేకపోతే బితుకుబితుకుమంటూ తను ఒక్కతే కూర్చోవాలి. అక్కడ అహల్యా వాళ్లిల్లు చూడు - ఎంత బావుందో! చక్కగా ఇద్దరికి సరిపోయినట్టు, అన్ని పదుపాయాలతోనూ, అమరిగ్గా కుదిరింది. అలా వుంటే బావుణ్ణు. ఇంతిల్లన్నమాటే - ఎలక్ట్రిసిటీ లేదు, కొళాయి లేదు, బావి వొక్కటుంది పాతాళ గంగతో. ఎవరో పెద్దకుటుంబంవాళ్ళు తీసుకోవలసిన ఇల్లుగాని, ఇద్దరికి ఎందుకు?

జట్కావాడు తెచ్చిపడేసిన సామానంతా ఒకవారగా లాగుతోంది శకుంతల. ధూళితో నిండిన ఆ ఇంట్లో ఎక్కడ కూర్చోడానికి మనసొప్పక, తాము తీసుకొచ్చిన పెట్టెలమీదే ప్రయాణబడలికతో కూలబడ్డాడు రాజారావు.

కథానిక

“అద్దె ఎంతండీ?” అడిగింది శకుంతల.

“25 రూ॥”

“అమ్మ బాబోయ్!” ఒక్కసారి ఎగిరి పడింది. నవ్వాడు రాజారావు.

“అంతద్దె ఇచ్చుకొని ఇంతపెద్దిల్లు తీసుకోకపోతే ఏమండి?....”

“నీకో సలాం పెడతానుగాని, మరేం మొదలుపెట్టక. ఇప్పటికే అలిసిపోయిఉన్నాం” అంటూ ఆమె చెబుతున్న మాటలును మధ్యలోనే ఆపేశాడు రాజారావు. అప్పటికి శకుంతల మరేం మాటాడక పెరట్లోకివెళ్లి చీపురూ, చేటా తెచ్చి ధూళి కొట్టుకుపోయిన ఇంటిని బాగు చెయ్యసాగింది.

ప్రయాణ బడలికవల్లా, ఇంటి శుభ్రతలో మునిగిపోవడంవల్లా, ఓ వారంరోజులు ఏమీ మాట్లాడలేదు శకుంతల.

ఆ తరువాత మొదలు పెట్టింది, ‘ఇద్దరికెందుకండీ ఇంతిల్లు’ అనడం, అంది. అంటోంది, అనబోతోంది-ఎన్నిమార్లో! ఆమె అంటూండడమే గాని అతను జవాబివ్వనే ఇవ్వడు. ఓ సారి అతన్ని నిలవేసింది-

“ఏమండీ! ఇంకో ఇల్లు చూడరాదుటండీ!” అంటూ. “ఏం? దీనికేమొచ్చింది?” అన్నాడు రెడ్డొచ్చె మొదలాడుమన్నట్లు.

"'ఏం వొస్తుంది - పాతిక రూపాయలాదులు స్తుంది. పిట్టల్లా ఇద్దరమున్నామో లేమో బోషాణమంతిల్లు."

"ఒక్క బోషాణమే ఏంకర్మ! వంద బోషాణాల పెట్టు." నవ్వాడు.

"అబ్బ! మీకన్నీ వేళాకోళమే. ఈ ఇంటంతటికీ చాకిరీ చెయ్యలేక మధ్య నే చస్తున్నాను."

"అయ్యో! అలాగా. మన పనిమనిషి ఎంత పుణ్యం చేసుకుందో - కూర్చోబెట్టి జీతమిస్తున్న అమ్మగారు దొరికింది." అనే సరికి వీధిలోనించి ఎవరో పిల్చారు. ఇదే సందు అనుకొని జారిపోయాడు రాజారావు. శకుంతలకు మాత్రం ఐదు రూపాయిల నోట్లు ఐదు కళ్ళముందు తిరిగి పోయాయి.

"ఇల్లు మార్చేద్దాం ఇంకోయిల్లు చూడండీ" అంటూ వేధించడం మొదలు పెట్టింది శకుంతల. ఈ వూళ్ళో ఇళ్లు దొరకవు అంటూ నెట్టుకొస్తున్నాడు రాజారావు.

శకుంతలకు ఈ ఇల్లు చూస్తూంటే దిగులు పుట్టుకొస్తోంది. పాతికరూపాయలు ఇంటికే అర్పిస్తే ఎలా? ఏ రెండువందలు, మూడు వందలు జీతగాడుండవలసిన ఇల్లోగాని, తాముండవలసినదా? పదిహేను రూపాయిల అద్దెగలదైతే తమకు చాలదూ. నెలకి పది రూపాయలు మిగులుతాయి. ఆ పదిరూపాయలు పెడితే ఏమన్నా కొనుక్కోవచ్చు. తనకి చీరొస్తుంది. లేకపోతే ఆయనకు పంచలుగాని, రెండు షర్టులుగాని రావొచ్చు. ఉంటే ఏమన్నా కొనొచ్చు. కాని ఏదీ?....ఇల్లు మింగేస్తోంది.

పోనీ ఇంటినిండా సామానైనా ఉందీ అంటే అదీలేదు. ఇద్దరికేముంటుంది? రెండు బట్టల పెట్టెలు, ఈ ట్రాన్సఫర్లయేటప్పుడు బిందెలు చెంబులు పడేసి తీసుకుపోవడానికి మూడు కర్రపెట్టెలు, ఓ టేబిలు, రెండు కుర్చీలు, మంచం, పరుపు. ఈ సామానుకి ఇంతిల్లు!

తీసుకుంటున్నప్పుడు ఆ మనిషికి తెలియక్కర్లా? ముందుగా వచ్చి చూసుకుని వచ్చారు కదా! మొనగాళ్ళలా బయలుదేరడమేగాని ఈ మగాళ్ళకేదీ తెలీదు. మళ్లీ పొదుపు పొదుపు అంటూ ఆడవాళ్ళకి బుద్ధిగరపబోతారు.

పోనీ సదుపాయాలేమన్నా ఉన్నాయా అంటే, ఏమన్నా అనుకోవచ్చు. ఈ పాతిక రూపాయలూ పెడితే పట్నాల్లో కూడా అన్ని సదుపాయలతో మహరాజులాంటి ఇల్లొస్తుంది. మేడమీద ఇంటికి ముందువైపున ఉండవలసిన డాబా వెనకవైపున పెట్టాడు. సాయంత్రం వేళ అలా డాబామీదకు ఎక్కుదామన్నా ఏమి కనిపిస్తుంది? ఇంక రాత్రయిందే అంటే ఈ లంకంత కొంపలో గుడ్డిదీపాలు పెట్టుకుని తడుములాడవలసిందే!

ఆ నెల ఇంటద్దె శంకుతలే ఇవ్వవలసొచ్చింది. రాజారావు స్నానం చేస్తున్నప్పుడు- ఆ మనిషివచ్చాడు. పెట్టెలోనించి తీసి ఇచ్చేయమని చెప్పాడు రాజారావు. ఐదురూపాయిల నోట్లు ఐదు లెక్కపెట్టి ఇచ్చేటప్పుడు ముచ్చెమటలు పోసి, చేతులు వణికాయి-శకుంతలకు. ఆ రోజంతా నీరసంగా అయిపోయింది.

పోనీ ఇంటికొచ్చినవాళ్లు ఎవరైనా వూరుకొంటున్నారా? 'ఇద్దరికి ఇంతిల్లు ఎందుకమ్మా?' అని ఒకమ్మంటే, "చాలా వేస్టండీ!" అంటుంది ఇంకొకామె. "ఆఫీసుకూడా ఇక్కడే నేమిటమ్మా?" అని ఒకమ్మంటే "ఇంతిట్లో ఆయన లేనప్పుడు ఒక్కరూ ఎలాగుంటున్నాండీ!" అంటుంది ఇంకొకావిడ. ఈ మాట లన్నీ వింటూంటే శకుంతలకు వున్న మతి కాస్తా వూడిపోతోంది.

"ఇంకో ఇల్లు చూడండీ!" అంది శకుంతల.

"హబ్బ! ఇక్కడ దొరకవంటూంటే!" విసుక్కున్నాడు రాజారావు.

"మీరు చూస్తే కదా దొరక్కపోవడానికి పాతిక పోస్తున్నామన్నమాటే సదుపాయాలా సాలెగూళ్ళా? కొంపంత లంకలో...." ఫక్కుమన్నాడు రాజారావు.

"ఉట్టినే నవ్వేస్తారే - మాట తప్పించెయ్యడానికి." "అది కాదు శకూ!ఇప్పుడీ ఇంటికి ఏం తక్కువొచ్చిందీ అని" బలవంతాన నవ్వాపుకుంటూ అన్నాడు రాజారావు.

"ఎబ్బే! ఏం తక్కువొచ్చింది. ఎలక్ట్రిక్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోయి,కొళాయి నీళ్ళు కారిపోతున్నాయి."

"నీ పిచ్చిగాని, ఎలక్ట్రిసిటీ, కొళాయి ఈ వూరికే రానివి,ఈ ఇంటికి ఎలా వస్తాయి శకుంతలా! అయినా అవన్నీ వస్తే ఏ నలభైయ్యో, యాభైయ్యో అవుతుంది. అప్పుడు దీని మొగం చూడొస్తామా?" అన్నాడు ప్రసన్నంగా.

"ఈ తప్పించుకోడాలన్నీ ఏం లాభంలేదు. రేపట్నించి ఇల్లు వెతకండి" అంది ఖచ్చితంగా ఉడుకుమోత్తనం భరించలేక.

"ఆఁ అదేపని. ఉన్న మూణ్నాళ్ళ ముచ్చటికి తొంభైఇళ్ళు మారదాం" సర్రుమనిలేచాడు- సామదానభేదోపాయాలు పారనివాడిలా.

"మూణ్ణాళ్లు, మూణ్ణాళ్లంటూ మూడు సంవత్సరాలు కూర్చోండి, మూడు వంద లొదుల్చుకుని." సర్రున లోపలికి దూసుకు పోయింది శకుంతల.

శకుంతల విషయం చూస్తూంటే రాజారావుకి వళ్ళు మండుతోంది. ఒక్క నిముషం స్థిమితంగా ఉండనివ్వదు. ఇల్లు ఇల్లని ఒకటే గోల. లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా అదే పలవరింత. ఆమె గోల చూస్తోంటే అతనికి విసుగు, కోపం వస్తోంది. చూశాడు చూశాడు. దీనికేదో మందు వేయకపోతే లాభం లేదనుకున్నాడు.

"మీ పుట్టింటికి వెళ్తావా?" అన్నాడు ఓ రోజు హఠాత్తుగా. ఆమె కర్థం కాలేదు.

"పంపిస్తే వెళ్తాను" అంది అకారణంగా ఎందుకడుగుతున్నాడా అనుకొని.

"అయితే రెడీ. నీ వెప్పుడు సరుకుని బయలుదేరితే అప్పుడే" అన్నాడు.

"ఏమిటంత తొందర?" అంది అనుమానంగా అతని మొగంలోకి చూస్తూ.

"నా మనసు హాయిగా వుంటుంది. ఈ వూళ్ళో వున్నంతకీ నువ్వు రానక్కరలేదు. ఇంకోవూరు ట్రాన్సఫర్ అయితే, అక్కడ పదిహేను రూపాయిల ఇల్లు తీసుకొని అప్పుడు నిన్ను తీసుకొస్తాను" అన్నాడు ప్రక్క చూపుతో ఆమె మొగంలోని మార్పులను కనిపెడుతో.

"అయితే నే వెళ్ళనే వెళ్ళను" అంది. చురచుర అతని కళ్ళలోకిచూసి వినవిన నడిచి వెళ్ళింది. అది మొదలు ఇంటి విషయం వేధించడం మానేసింది. ఏమైనా అంటే పుట్టింటికి వెళ్ళిపో అని ఎక్కడంటాడోనని భయం.

♦ ♦ ♦

ఏదో పని తగిలి చిత్తూరు వెళ్ళవలసొచ్చింది రాజారావు. ఆమెకు భయంలేకుండా వుండడానికి జవాను అప్పలస్వామితో రాత్రుళ్ళు పడుకోమని చెప్పివెళ్ళాడు.శకుంతల మామూలుగానే తనకి వండుకుతినేసి అప్పలస్వామి ఉన్నాడు కదా ఇంక భయమేమిటనుకుంది. అప్పలస్వామి వీధి నడవలో పడుకున్నాడు. ఈమె హాల్లో పడుకునుంది.

నిద్రపోయే ముందు ఏభయాలూ లేకుండా, శాలువా తలతోసహా నిండా ముసుగుపెట్టి నిశ్చింతగానే పడుకుంది. సగం రాత్రప్పుడెందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది. అయినా కళ్ళు మూసుకొని కదలకుండా అలానే వుంది.

అడుగుల చప్పుడు వినిపించింది. బలమైన శరీరం బలంగా శ్వాసపీలుస్తున్న శబ్దం. అంతవరకు ధైర్యంగా వున్నది-ఈ శబ్దాలు వినేసరికి భయం పట్టుకుంది, తను మెలకువగా వుందో, నిద్రపోతోందో చూడడానికి ఆ ఆకారం తన మొగందగ్గర వంగి శాలువా ఎత్తిచూచినట్టుగా అనిపించింది. ఆ మనిషి బలమైన శ్వాస మొగానికి తగిలింది. బరువైన శరీరం. ఆమెకు గుండె దడదడా కొట్టుకోవడం మొదలుపెట్టింది. తరువాత అడుగుల చప్పుడు వీధి వరండావేపు వెళ్ళి వీధి గడియ తీసిన చప్పుడుతో అంతమయింది.

ఆమె గుండెదడ స్పష్టంగా వినిపిస్తోంది. ఆ గుండెదడ విని ఆ దొంగ మళ్లీ ఎక్కడ వచ్చి పీక పట్టుకుంటాడోనని మెల్లిగా చెయ్యి కదిపి గుండెలమీద వేసి గట్టిగా అదుముకుంటోంది. శరీరం నిండా ముచ్చెమటలుపోసి ఊపిరి తిరగడంలేదు. క్రమంగా కాళ్లు,చేతులు వళ్ళంతా వణుకు పుట్టుకొస్తోంది. తను మెలకువగా ఉన్నట్టు తెలిస్తే మళ్ళీ ఆ దొంగ ఎక్కడవచ్చి పొడుస్తాడోనని భయం. ముసుగు తీసి చుట్టూ చూద్దామంటే భయం.

కొంతసేపటికి సంబాళించుకొని ఎక్కడైనా శబ్దం వస్తుందేమోనని జాగ్రత్తగా వింది. నడ

వలో అప్పలస్వామి పెడుతున్న 'గుఱ్ఱు' తప్ప ఇంకే శబ్దం రాలేదు. నిద్ర పట్టడంలేదు. ఇటు నుంచటు తిరుగుదామంటే భయం. మొగం మీదినించి శాలువా తీయకుండా శాలువాలో నించే చుట్టూ చూడడానికి ప్రయత్నించింది. చీకటిలో ఇల్లంతా ఖాళీగా కనిపించింది. దీపం కూడా ఆర్పేశాడు దొంగ.

వంటింట్లో ఇత్తడి సామానూ, బిందెలు తీసుకుపోయివుంటాడు. తన బట్టలపెట్టె కొత్తగా కనబడుతుంది. అవి మేడమీదకు పట్టుకు పోయి వుంటాడు. తన సిల్కుచీరలలో కొత్తవి తీసుకుంటాడు, పాతవి చెల్లాచెదరుగా విసిరే స్తాడు. అందులోవున్న కొద్దిపాటి వెండిసామాను పట్టుకుపోతాడు. ఇంకేమున్నాయి? తన వంటి నున్నది తప్పితే బంగారంలేదు. డబ్బా? ఎప్పటిదప్పుడే ఎల్లమ్మ తీర్థం.

రేపు వుదయం లేవగానే చిత్తూరు ఒక వుత్తరం రాసేయాలి - వెంటనే వచ్చేయమని. ''మీరు పెట్టిన వెండి సామాను దొంగెత్తుకు పోయాడ''ని అమ్మకొకటి రాసేయాలి.

ఆమెకు నిద్రరావడంలేదు. భయం. ఆలో చనలు. కదలామెదలకుండా అలాగే తెల్లవార జేసింది. పాల మనిషివచ్చి తలుపు దబదబా బాదుతున్నా కదలలేకపోయింది. అప్పలస్వామి లేచి తలుపుతీస్తున్న అలికిడి విని లేచింది. పాలగిన్నె తీసుకురావడానికి వంటింట్లోకెళ్లాలంటే భయం. మెల్లిగా గుండెలు చిక్కబట్టుకుని వెళ్ళింది. తమతమ స్థానాల్లో ఇత్తడి సామాను యథాతథంగా ఉన్నాయి. గడియలు కూడా ఎలాంటివలా వున్నాయి.

అప్పలస్వామిని, పాలమనిషిని పంపించేసి గబగబా బట్టలు పెట్టెలు చూడడానికి వెళ్లింది. వాటిలో కదలికయినా లేదు. తనపెట్టె తీసి చీరలు, వెండిసామాను అంతా చూసుకుంది. అన్నీ ఉన్నాయి.

ఏమిటిది? దొంగ రాలేదూ? కలగందా తను. ఏమిటో ఆమెకే తెలీడంలేదు. గాబరా, ఏమిటో అయిపోతుందేమో ననిపిస్తోంది. అంతింట్లో ఒంటరిగా .... గుహలో బంధింప బడినట్లు.... భయం, భయం.

వీధి తలుపు వేసుకొని మొగం కడుక్కుందా మని పెరట్లోకి వెళ్లింది. ఇంట్లో ఎక్కడైనా దాక్కున్నాడేమో? ఇప్పుడు వచ్చి తననేమి చేస్తే ఎవరికి తెలుస్తుంది? అనుకుంటోంది, వంటింట్లో గిన్నెలు జరజర జారిన చప్పుడైంది.

గజగజా వణికిపోయింది శకుంతల. భయం వల్ల కలిగిన ఆవేశంతో గుండె అంతెత్తున ఎగిరి పడుతోంది. నోటి తడి ఆరిపోయింది. పెరటి తలుపు తీసుకొని అలా ఎవరింటికైనా పారి పోదామా అనిపించింది. నోట్లో వండ్లు తోము తున్న వేలితో అలాగే నుంచుండి పోయింది. చూడ చక్కని తెల్లపిల్లి తోకాడించుకుంటూ వంటింట్లోంచి వచ్చి బావిపక్కనించి పరు గెత్తడం చూసింది.

మొగం కడుక్కోడం ఆదరాబాదరా అయిం దనిపించేసి ఒక్క ఉరుకులోవచ్చి వీధి తలుపు తీసేసింది. అప్పటికి గాని కుదుట పడలేదు. అయితే తన వంట, స్నానం మాట ఏమిటి?

పని మనిషి వచ్చి పనిచేస్తూంటే అన్నం ఒక్కటే కుంపటిమీద పెట్టేసి, ఆ చలిలో చన్నీళ్లే స్నానం చేసేసింది. మధ్యాహ్నం ఎదురింటి అమ్మాయిని సాయం పెట్టుకొని, కందిపొడి కలుపుకొని ఆవకాయతో భోజనం పూర్తి చేసింది.

ఆ మూడు రోజులు ఎలా గడిపిందో దేవు డికే తెలియాలి! భయమూ, శకుంతలా ఏకమై పోయారు. పట్టపగలు కూడా భయంతో మనిషి కాలేకపోతోందంటే....

దానికి తోడు ఇరుగు పొరుగు వాళ్ళొచ్చి, రాజారావు లేడని తెలిసే సరికి మొదలుపెట్టే వారు. ఇంట్లో మగవాళ్ళు లేరని తెలిసే సరికి వాళ్ళకి అంటే దొంగలకి ఎంతధైర్యమో, పట్ట పగలే ఎలా దొంగతనాలు జరుగుతున్నాయో, ఆడవాళ్ళని ఎలా ఏమార్చేస్తుంటారో చెప్పి చెప్పి ఆమెను ఏదో చేసేసి వదిలిపెట్టారు.

రాజారావు వచ్చేవరకు గుండె లరచేతిలో పెట్టుకుని, వచ్చేసరికి ''వచ్చారా?'' అంది ఆత్రంగా. ఆమె మొగం చూసి అతను హడలి పోయాడు. ఆమె అంతా చెప్పింది.

అతను నవ్వి "వాడేం పిచ్చివాడా? మన ఇంట్లో పడితే వాడికి కూలైనా గిట్టదని వాడికి తెలియదనుకున్నావా?" అన్నాడు. భయంతో పీడింపబడుతున్న తన అవస్థ తలుచుకుని, దుఃఖంతో ఆమె గొంతు పూడ్చుకుపోయింది.

అదిమొదలు ఆమె భయం తీరడం లేదు. రాజారావు వెళ్లేలోపున అన్నీ పనులూ పూర్తి చేసుకునేది. అతన్ని సాయం తీసుకుని మేడ మీదకు వెళ్ళి తలుపుల గడియలన్నీ వేసున్నాయో లేదో చూచేది. అతను వెళ్ళినప్పుడు వీధి తలుపులు తీసేసి కూర్చుంటే, మళ్లీ అతను వచ్చినప్పుడే లేచేది.

అసలు ఈ వెండి బంగారాలు యెందుకు వచ్చాయో, వీటివల్లే ఈ రక్షణలు, బాధ్యతలు, భయాలూ అన్నీ. హాయిగా ఇవేవీ లేకుండా అడవుల్లో పడి బ్రతికితే బావుండేదేమో! వాడెవడో ఆ రాత్రి వచ్చి, వున్నదేదో ఎత్తుకునన్నా పోయాడు కాదు. ఇంట్లో వున్నది పట్టుకుపోతే ఫరవాలేదుగాని మనుషుల్నేమన్నా చేస్తేనే....

వీధి తలుపువేసి పనిచేసుకుంటే — దొంగ వచ్చి ఏం చేస్తే తన గతి ఏంకావాలి? పగలు అయితే మాత్రం ఈ ఇంట్లో ఏం జరిగితే ఎవరిక్కావాలి? ఎవరు చూడొస్తారు? మేడమీద దాక్కుని తను తలుపు వేసేసరికి దిగి రాకూడదూ? ఏమో తను వీధి తలుపు వేసేసరికి ఎక్కడనుంచయినా ప్రత్యక్ష్య మౌతాడేమోనని భయపడింది.

గడియలన్నీ పదిమార్లు చూచి చూచి వస్తుంది. అయినా ఏమిటో నమ్మకం లేదు. రోజు గడపడం బ్రహ్మాండమయిపోతోంది.

ఓ కుర్రాడు దేనికో చందాకోసం వస్తే, రాజారావు రూపాయి ఇచ్చాడు. ఆ కుర్రాడు రెండు రూపాయలేనా ఇస్తేకాని వీల్లేదన్నాడు. వీళ్ళిద్దరూ అలా తగువులాడుకుంటూంటే శకుంతల అలా చూస్తూ వూరుకుందేగాని నోరు మెదపలేదు.

ఆ కుర్రాడితో తగువులాడుతూ ఆమె మొగంలోకి చూస్తున్న రాజారావు ఆమె మాట్లాడకపోవడం చూచి ఆశ్చర్యపోయాడు. అంతకుముందోసారి ఇలానే చందాకోసం వస్తే--

"ఇవా లెన్నో తేదీ?" అనడిగింది.

"ఇరవైతొమ్మిది?"

"మరి ఇప్పుడు మాదగ్గర డబ్బుంటుందని ఎలా అనుకున్నావు?" అంది, దాంతో వాడు నోరు మూసుకుని వెనక్కు తిరిగాడు. ఈ ఇంటికి పాతిక పోస్తున్నది చాలక ఇంకా ఈ చందాలు ఎక్కడ ఇస్తామంటుంది. ఈ ఇంట్లో వుండడంవల్లే ధనవంతుల మనుకుని ఇంత మంది చందాలకు వస్తున్నారనీ, అదే చిన్న ఇంట్లో వుంటే ఇంతమంది రారనీ, అథవా వచ్చినా ఇచ్చినంత పుచ్చుకొని వెళ్ళిపోతారనీ ఆమె వాదన.

అలాంటి శకుంతల వూరుకుందే అంటే రాజారావుకు ఆశ్చర్యమే వేసింది. ఆ ఆశ్చర్యంలో సంతోషమూ, విచారమూ సమపాళ్ళలో వున్నాయి. అప్పడంతా శకుంతలకి పట్టిన ఇంటి సమస్యని చూసి చూసి మందేపి మాన్పించాడు, కాని ఇప్పుడు దాని తాతలాంటి భయం సమస్యవచ్చింది. ఈ భయాన్ని మాన్పించడం తన తరంకాదు గదా, తన్ను పుట్టించిన ఆ దేవుడితరం కాదనుకున్నాడు.

రాజారావుకి విసుగొస్తోంది. సాయంత్రం వేళైనా ఎక్కడికీ కదలనివ్వదు. అతను తొమ్మిది గంటలకి ఆఫీసుకి వెళ్ళేలోపల వంట పూర్తి చేస్తుంది. ఒకవేళ అప్పుడు పూర్తి కాకపోతే, మళ్ళీ తను నడి మధ్యాహ్నం వచ్చిన తరువాతే పూర్తి చేస్తుంది. ఆమె అంతగా భయపడుతోంటే ఏమనడానికీ నోరురాదు. కాని విసుగు ఏమిటీ ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఎంతకని?

మేడమీద వాడకం ఏమీలేదు కాబట్టి, కిటకీ తలుపులతో సహా వేసేసి తాళం వేసేసింది. ఉదయం తేస్తే మళ్ళా రాత్రి పడుకునే ముందే వీధి తలుపు వేసేది. ఎప్పుడూ వీధి కెదురుగా కూర్చునేది-మనుషులు కనిపిస్తూంటే ధైర్యంగా వుంటుందని రాత్రుళ్ళు నిండా ముసుగుపెట్టి రాజారావును ఆనుకొని పడుకుంటుంది. ఏ అర్థరాత్రో మెలకువ వస్తే హడలిపోయి - అతని దగ్గరగా ముడుచుకొని పడుకునేది.

ఆమె భయానికి తోడు వాళ్ళూ వీళ్ళూ వచ్చి దొంగల విషయాలు, కిటికీల్లోంచి వెదురు కర్రలతో దండెంమీది బట్టలు ఎలా తీసేస్తారో, ఏఏ మారువేషాల్లో ఎలా ఎలా ఏమారుస్తారో, తమ బంధువుల ఇళ్ళల్లోనూ, తమ ఇంట్లోనూ ఏమేమి దొంగతనాలు జరిగాయో, విన్నవీ కన్నవీ చిలవలు పలవలు చేసి చెప్పడం - దానికి ఆమె మరింత బెంగపెట్టుకుని హడలి పోవడం.

"అవన్నీ నువ్వెందుకు వింటావూ" అంటాడు రాజారావు. వాళన్న మాటలు పదే పదే జ్ఞాపకానికి వస్తోంటే తన నీడనుచూసి తనే జడుసుకుంటోంది శకుంతల.

ఓసారి ఓ ముసలాయినవచ్చి, తను పూర్వం ఇక్కడే అంటే ఇప్పుడు అప్పలస్వామి స్థానంలో పనిచేసేవాడినని, ఇప్పుడు రిటైరయిపోయానని చెప్పి-

"ఇది బేవార్సు కొంపమ్మా! ఒక్కరూ వున్నారు. జాగ్రత్తగా వుండాలి. పెద్దవాళ్ళ నెవరినైనా సాయం తెచ్చుకోలేక పోయారా? బేవార్సు కొంపమ్మా, బేవార్సుకొంప!" అని హెచ్చరించాడు.

ఇవన్నీ వింటూ ఆఁ మన దగ్గరేమున్నాయి తీసుకుపోవడానికి అనుకునేది. చూస్తే లంకంత కొంప!-ఏమైనవున్నా ఏమోనని ఆశపడి వచ్చేస్తారు-అని మళ్ళీ అనుమానం, ఈ భయం తలుచుకుంటే ఆమెకు నిద్రారాదు, అన్నమూ దిగదు.

రాజారావుకి మళ్ళీ చిత్తూరు వెళ్ళవల సొచ్చింది. ఆమెతో చెప్పాడు.

"నేనూ వచ్చేస్తాను. వుండలేను. ఉంచి వెళ్ళారా-ఈ భయంతో చచ్చిపోతాను" అంది.

"ఒక్కరోజే శకుంతలా! మర్నాటికల్లా వచ్చేస్తాను. ఎలాగో ఓపికపట్టు." అని నచ్చ జెప్పజూచాడు.

"అమ్మ బాబోయ్! ఒకరోజు కాదుగదా ఒక నిముషం వుండలేను. ఏ హోటలులోనో దిగుదాం. డబ్బు పోతేపోయింది. మరేం అడ్డు చెప్పకండి" అనేసింది. మరేం అనలేక పోయాడు రాజా-

ఇద్దరూ చిత్తూరువెళ్ళి హోటలులో గది తీసుకుని వున్నారు. రాజారావు పని పూర్తిచేసు కున్నాక తిరిగి వచ్చేశారు. కాని డబ్బు బాగా ఖర్చయింది.

రాజారావుకి ఆలోచన పట్టుకుంది. ఎలాగ? తనకి తరచుగా చిత్తూరు వెళ్ళవలసిన పని వుంటుంది. ప్రతిసారీ ఇంతింత డబ్బు ఖర్చు పెడితే తనేమన్నా బ్రతకాలా? ఆదీగాక ఎప్పుడూ తను ఇంట్లో వుండాలంటే ఎలా కుదురుతుంది?

ఇల్లు మారుస్తే ఏమన్నా భయం తగ్గుతుం దేమోనని ఇంటికోసం వెదక సాగాడు. వాకబు చేసిచేసి వెదగ్గావెదగ్గా పదిహేనుకు ఇల్లు దొరి కింది. ఆ ఇల్లు చూపించాడు శకుంతలకి.

ఓ నడవా, రెండు గదులూ, వంటిల్లూ, బాత్‌రూము అన్నీ అమరిగ్గా వుంది. వెంటనే మార్చేద్దామంది. ఓ మంచి ముహూర్తాన పాతిక రూపాయిల ఇంటిలోనించి పదిహేను రూపా యల ఇంటిలోకి మారారు రాజారావు శకుంతలా.

ఈ ఇంటిలోకి వచ్చిన తరువాత శకుంతల తృప్తిగా నవ్వింది. రాజారావుకి మాత్రం అను మానం బలంగావుంది. ఇల్లు మారడానికి శకుం తల భయమని ఎత్తువేసి వేధించిందా-అని. మరి ఇక్కడికి వచ్చిన తరువాత భయమనే మాటే వుచ్చరించడం మానేసింది.

ఓసారి మెల్లిగా అడిగాడు

"శకుంతలా! నేనొకటడుగుతాను నిజం చెబుతావా?" అని.

"ఏమిటది?" అంది నవ్వుతూ.

"ఆ ఇంట్లో నీకు నిజంగా భయం వేసేదా? లేకపోతే ఇల్లు మారటానికి ఆఎత్తు వేసేవా?" అన్నాడు ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"ఏం ఎందుకంత అనుమానం వచ్చింది?"

"నీ తత్వం చూస్తూంటే అనుమానం రాకుండా వుంటుందా?"

"పోనిద్దురూ! ఆ అనుమానం అలాగే వుండ నివ్వండి. ఇల్లు ఎలాగా మారిపోయాం. ఆ సందేహం తీరినా ఒకటే తీరకపోయినా ఒకటే" అంటూ నవ్వేసింది రెండు సమస్యలూ తీరిన శకుంతల.

★